క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సెల్వమణి

పుత్తూరు: పట్టణంలోని ఆరేటమ్మ గిరిజన కాలనీలో శ్రీశక్తి వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, వార్డు కౌన్సిలర్ జయలక్ష్మి దంపతులు ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. దైవ చింతన, మానసిక ప్రశాంతతకు ఆలయాలు ఒక సాధనమన్నారు. కార్యక్రమంలో ఆరేటమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, లారీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ పుట్టిన శిశువుకి 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆ తరువాత తృణధాన్యాలతో తయారు చేసిన కిచిడి, పొంగలి, పప్పులు, పండ్లు ఇవ్వాలన్నారు. అలా క్రమంగా పిల్లలకు ఆహారం మోతాదును పెంచుకోవాలని తెలిపారు. గర్భిణులు, ప్రసవం వరకు ప్రతి నెలా వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సచివాలయ కన్వీనర్



వికలాంగుడైన ప్రభాకర్‌కు స్టిక్స్ అందజేస్తున్న వెంకటేష్

శ్రీరంగరాజపురం : నడవలేని స్థితిలో ఉన్న వికలాంగుడికి వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్, పుల్లూరు సచివాలయం కన్వీనర్ వెంకటేష్ స్టిక్స్ అందజేసి, తన మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సేవలు తనని ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. ఈ నేపథ్యంలో పేదలకు తన వంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఇందులో భాగంగా 50 బసివిరెడ్డిపల్లె షికారీ కాలనీకు చెందిన ప్రభాకర్ నడవలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న తాను చిత్తూరుకు వెళ్లి నడవడానికి స్టిక్స్ తీసుకు వచ్చి ఇచ్చానన్నారు.

మంచి ఫలితాలతో ఉజ్వల భవిత



ఓంకారం చుట్టూ కొవ్వొత్తులు వెలిగిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు



తమిళ సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థిని

సత్యవేడు: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెచ్‌ఎం భారతి అన్నారు. బుధవారం పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూల్లో సరస్వతి పూజ, టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉప్పుతో 'ఓంకారం' ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, చుట్టూ కొవ్వొత్తులు వెలిగించారు. వారితో ఉపాధ్యాయులు చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేయించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, మంచి మార్కులతో ఉత్తీర్ణులై భవితకు పునాది వేసుకోవాలని, స్కూలుకు, తమ గ్రామాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థినులు డ్యాన్సులతో హోరెత్తించారు. కార్యక్రమంలో సర్పంచ్, టీచర్లు జయంతి, ప్రేమ్‌కుమార్, జగదీష్, ఏకాంబరం, ఆంథోని, శివలింగం, మునిబాల, వ్యాయామోపాధ్యాయురాలు కె.గ్రేస్ ప్రతిమ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం పరుగు

- చంద్రబాబు పాలనలో కరువు, కష్టాలు
- జగనన్న పాలనలో ప్రజల ముంగిటకే సేవలు
- వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించండి
- సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా



అగరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నిండ్ర: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని, అభివృద్ధిలో ఇదో విప్లవాత్మకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని అగరంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, రూ.20.8 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటిస్తే సమస్యలే స్వాగతం పలికేవన్నారు. ప్రజా సంకల్పయాత్రలో జగనన్న దృష్టికి వచ్చిన సమస్యలన్నీ అధికారంలోకి వచ్చాక పరిష్కరించారని స్పష్టం చేశారు. ఒక్క అగరం సచివాలయం పరిధిలో రూ.10.98 కోట్ల వరకు సంక్షేమాభివృద్ధి జరిగిందన్నారు. ఇప్పుడు గ్రామాలకు వస్తే చిరునవ్వులే స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఇంటింటికీ తిరిగే నాయకులు కరోనా విపత్కర పరిస్థితుల్లో ఎందుకు ముఖాలు చాటేశారని సూటిగా ప్రశ్నించారు. 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజలను కష్టాల్లోకి నెట్టేసి, కరువులోకి నెట్టేసిన చంద్రబాబు కావాలో..ప్రజల చెంతకే అన్ని సేవలూ తెచ్చి సుపరిపాలన అంటే ఏమిటో చేతల్లో చూపిన జగనన్న ప్రభుత్వం కావాలో ప్రజలే తీర్పు చెప్పనున్నారన్నారు. మంచి చేసిన వారికి అండగా నిలబడితే మరింత మంచి చేస్తారని వారికీ తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, దుర్గాదేవి, ఎంపీడీఓ భవాని, సర్పంచ్ చెల్లెమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా కార్యదర్శి మేరి, సింగిల్‌విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీలు విజేష్, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి,



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

ఎస్సీసెల్ అధ్యక్షుడు దామోదరం, ఆర్బీకే చైర్మన్ వీరయ్య, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు సెల్వం, వెంకటేష్, తోయద్రాక్షారం, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

- విదేశీ వ్యవహారాల సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి



జ్ఞానేంద్రరెడ్డిని సన్మానిస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం(పెనుమూరు): వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా పనిచేయాలని విదేశీ వ్యవహారాల సలహాదారు ఎం జ్ఞానేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి, విదేశీ వ్యవహారాల సలహాదారు జ్ఞానేంద్రరెడ్డిని కలసి, తమ విజయానికి కృషి చేయాలని అభ్యర్థించారు. అనంతరం జ్ఞానేంద్ర రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్న కళత్తూరు కుటుంబానికి చెందిన కృపాలక్ష్మి విజయానికి వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తన తండ్రి నారాయణస్వామి నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని, అదే కోవలో ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను సేవలు అందిస్తానని తెలిపారు. అనంతరం మండల కన్వీనర్ విజయకుమారెడ్డితో పాటు పలువురు నాయకులు కలసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి కే.నారాయణ స్వామి గురువారం వెదురుకుప్పం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం మండలంలోని పెరుమాళ్లపల్లె సచివాలయంతోపాటు వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అనంతరం దేవరగుడిపల్లెలో సచివాలయాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మంత్రిని కలిసిన జెడ్పీ సీఈఓ



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జెడ్పీ సీఈఓ

నగరి: జెడ్పీ సీఈఓ పి.గ్లోరియా బుధవారం నగరిలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజాను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కొంతసేపు మాట్లాడారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయండి



కృపాలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. బుధవారం పుత్తూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ తదితరులు కృపాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం తపించిన తన తండ్రి నారాయణ స్వామి సేవలు గుర్తించి, వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయాలని కోరారు. నిజాయితీకి మారు పేరుగా నిలిచిన తన తండ్రి బాటలో నడుచుకుంటూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజల శ్రేయస్సు కోసమే రాజకీయ అరంగేట్రం చేస్తున్నానని చెప్పారు. ఎంపీపీ లత మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ఏకతాటిపై నిలిచి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కృపాలక్ష్మికి శాలువ కప్పి గజమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపి, ఎంపీటీసీ సభ్యుడు ధన్‌రాజ్, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, శేషాద్రి, రాజారెడ్డి, కుప్పారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



జెడ్పీ సీఈఓ గ్లోరియాను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, అధికారులు

శ్రీరంగరాజపురం: ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ గ్లోరియా ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జెడ్పీ సీఈఓ గ్లోరియాను జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి ,అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఏఓ కృష్ణయ్య, ఎంపీపీ సరిత, అధికారులు బాలాజీ, జ్యోత్స్న, శోభరాణి, నాయకులు జనార్దన్, శేషాద్రి, హరి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రాణప్రతిష్ట



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ఆశీర్వచనం పలుకుతున్న వేద పండితులు

కార్వేటినగరం: మండలంలోని సురేంద్రనగరంలో ఉన్న వరద వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేద పండితులు వేద మంత్రాలతో ప్రత్యేక హోమాలు జరిపారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరదవేంకటేశ్వర స్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరాణలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

స్వామివారి సేవలో డిప్యూటీ సీఎం

సురేంద్రనగరంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వరదవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ లేనివిధంగా సురేంద్రనగరంలో వరదవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న సీఎం కావాలని స్వామివారిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న టీచర్ శ్రీరాములు

పుత్తూరు: పదవ తరగతి పరీక్షలను బాగా రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షిస్తూ హిందీ టీచర్ ఎస్.శ్రీరాములు విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేయడం హర్షణీయమని హెచ్‌ఎం బి.భారతి అన్నారు. బుధవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులై స్కూలుకు, గ్రామాలకు పేరు తేవాలన్నారు.

కమనీయం..శివపార్వతుల కల్యాణం



శివపార్వతులకు హారతి ఇస్తున్న రాస్ పీడీ నాగరాజు

పుత్తూరు: మండలంలో అప్పలాయగుంటలోని శ్రీచంద్రమౌళీశ్వర ఆలయంలో బుధవారం రాస్ సేవా సమితి ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని పొదుపు సంఘాల మహిళలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితులు మహిళలతో కళ్యాణోత్సవ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో రాస్ పీడీ వి.నాగరాజు మాట్లాడుతూ, లోక కళ్యాణార్థం నిర్వహించే కార్యక్రమాలతో మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు చేతి వృత్తులను నేర్చుకుని స్వయం శక్తితో ఎదగాలని పిలుపునిచ్చారు. పేద మహిళలకు దుప్పట్లు, చేతి కర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది వాణి, భార్గవి, మునిరాజ, లావణ్య, నాగరాజు, రామానుజులు, సత్యనారాయణ, బాలాజీ, మహిళలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా నీలావతి

కార్వేటినగరం: డిప్యూటీ తహసీల్దార్‌గా నీలావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుత్తూరులో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై కార్వేటినగరంలో ఆర్‌ఎస్ డీటీగా బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీపతి ఉద్యోగ విరమణ పొందడంతో ఆర్‌ఎస్ డీటీగా విధులు నిర్వహిస్తున్న నీలావతి బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌గా పదవీబాధ్యతలు చేపట్టారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



నగరి: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి
- ఎలక్షన్ నేపథ్యంలో సెలవు ఇచ్చేది లేదు
- ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నగిలి షణ్మోహన్



జీడీ నెల్లూరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు/నగరి:ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సగిలి షణ్మోహన్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం గంగాధరనెల్లూరు, సాయంత్రం నగరి ఆర్డీఓ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, నగరి ఆర్డీఓ వెంకట్రామి రెడ్డిలతో కలసి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు–2024కు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్, లా అండ్ ఆర్డర్, యంసిసి, ఎలక్షన్‌వ్యయం, ఎస్‌ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వీఎస్‌టి, వీవీటి, అకౌంట్స్, ఫిర్యాదులు, రిపోర్టులు, రవాణా, పోలింగ్, వివిధ రకాల మేనేజ్‌మెంట్ టీమ్స్ లోని అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, నగరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే కోడ్ అమలులోకి వస్తుందన్నారు. అలాగే కలెక్టరేట్‌లో తమ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని, అలాగే ఇక్కడ ఆర్డీఓ కార్యాలయంలో కూడా ఏర్పాటుకు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత టీమ్ నోడల్ అధికారి పరిశీలించి రిపోర్టును ఆర్ ఓ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిశీలించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు, ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నదా, లేదా? అని పరిశీలించి ఏఈఆర్‌ఓలు నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలని ఆదేశించారు. ఇంకనూ ఏమైనా పోలింగ్ కేంద్రాలలో మరమ్మతులు చేయవలసిన పక్షంలో సర్వశిక్ష అభియాన్ నిధులతో పంచాయతీ రాజ్ ద్వారా చేయించాలని ఎంఈఓలను ఆదేశించారు. ఈ మూడు నెలలు ఎలక్షన్ సమయంలో ఎవరికీ ఎలాంటి సెలవులు మంజూరు చేసేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలక్షన్ కోడ్ వచ్చిన వెంటనే ప్రతి కార్యాలయంలో ప్రభుత్వ అభివృద్ధికి సంబంధించి ఫొటోలు, బ్యానర్లు తొలగించాలని, రాజకీయ పార్టీల నాయకులు ప్రచార సమయంలో ఓటర్ల కు డబ్బులు, ఏవైనా వస్తువులు, మద్యం పంపిణీ చేసే సమయంలో వీడియోగ్రఫీ చేయాలన్నారు. గంగాధర నెల్లూరు జెడ్పీ హైస్కూలులో ఈవీఎంల రిసెప్షన్ సెంటర్, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్, రిసెప్షన్ సెంటర్‌ను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఓలు, యంసిసి, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వీఎస్‌టి, వీవీటి, అకౌంట్స్ బృందాల అధికారులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు రండి మేడమ్!



మంత్రి రోజా సెల్వమణి దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

పుత్తూరు: పెద్దతీర్థంకోన (మూలకోన)లో నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సెల్వమణి దంపతులను నిర్వాహకులు బుధవారం ఆహ్వానించారు. పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరపురంలోని పెద్దతీర్థం కోన వద్ద ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీసంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఏటా వైభవంగా నిర్వహించడం పరిపాటి. నిర్వాహకుల ఆహ్వానంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.భాస్కర్‌రెడ్డి, నిర్వాహకులు తిరుమలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మనోహర్, వెంకటరమణ, చౌటూరు శివారెడ్డి పాల్గొన్నారు.

రమణప్రసాద్‌కు జెడ్పీ చైర్మన్ పరామర్శ



జెడ్పీటీసీని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

శ్రీరంగరాజపురం : ఇటీవల అనారోగ్యం బారిన పడిన జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకుని రానున్న ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలోకి వచ్చి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు స్థానిక సర్పంచ్ రూప, నాయకులు మునికృష్ణ, జనార్దన్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు పౌరుల ప్రాథమిక హక్కు



ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు

వెదురుకుప్పం: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కు అని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. బుధవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మన ఓటు– మన భవిత' అనే అంశంపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి వ్యక్తి సరైన నిర్ణయంతో తన ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటరుగా ఉన్న ప్రతి వ్యక్తి తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటు బాధ్యత, విలువను అందరికీ చెప్పాలన్నారు. ఓటు వయోజనులకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రధాన ఆయుధమన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ



జ్యోతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేర్ అలీ

గంగాధర నెల్లూరు: మండలంలోని పట్టాభిరెడ్డి కాలనీ గ్రామానికి చెందిన జ్యోతి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు. బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వికలాంగురాలు జ్యోతికి గంగాధరనెల్లూరు సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హెచ్‌షేర్ అలీ తన సొంత ఖర్చులతో బెంగళూరుకు వెళ్లి వికలాంగులికి రూ.3వేల పింఛన్ అందజేశారు. అలాగే జ్యోతి భర్త రాజేంద్రన్ కూడా కల్లు గీత కార్మికుడు కావడంతో ఆయనకు కూడా రూ.3 వేల పింఛన్ అక్కడే అందజేశారు.

కరెంటు షాక్‌తో ఎద్దులు మృతి

పిచ్చాటూరు: మండలంలోని పులికుంద్రంలో బుధవారం విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామస్తుల కథనం.. మాలగుంటకు చెందిన రవి ఉదయం పులికుంద్రం గ్రామ రైతు సెల్వం పొలంలో వరి పైరు నాటేందుకు మడక తోలుతున్నాడు. ఆ సమయంలో పొలాన్ని ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొలం నీటిలో కరెంట్ సరఫరా కావడంతో రెండు ఎద్దులు షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఆ సమయంలో రవి గట్టుపైకి నీరు తాగేందుకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో, పశు సంవర్ధక శాఖ అధికారులు అక్కడికి పరిశీలించారు. బతుకుదెరువు లేకుండా పోయిందని రవి అధికారుల ఎదుట భోరుమని విలపించాడు. ఎద్దుల మృతి ఉదంతంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు.